www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | బుధవారం, అక్టోబర్14,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:220 | పేజీలు: 8 | వెల: రూ.5/-

ఎన్నికల ముందు ఇరాన్‌పై దాడి?

అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసే కీలక పరిణామం ఒకటి తెరపైకి వచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్య చేపట్టే అంశంపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మధ్య గత వారం ఈ కీలక సంభాషణలు జరిగినట్లు పలువురు అధికారులు తెలిపారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలను కమ్ముకునేలా చేస్తోంది.ఇజ్రాయెల్ నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఇరాన్ తన అణు కార్యక్రమానికి సంబంధించిన కొన్ని భాగాలను పునరుద్ధరించే ప్రయత్నాల్లో ఉందని నెతన్యాహు, ట్రంప్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పికాక్స్ మౌంటెన్' వంటి ప్రదేశాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

మీసేవ సర్టిఫికెట్లకు సరికొత్త

రక్షణ కవచం

- 15 అత్యాధునిక ఫీచర్లతో ప్రత్యేక పేపర్
- ఏళ్ల తరబడి భద్రపరుచునేలా రూపకల్పన
- ఇక లామినేషన్ అవసరం లేదు

కొత్త పేపర్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబర్ 13:(సామాన్యుడి అస్త్రం)

మీసేవ కేంద్రాల్లో తీసుకునే సర్టిఫికెట్లను ఇక లామినేషన్ చేయించి భద్రపరుకోవాల్సిన అవసరం ఉండదు. మలిచినా, నీళ్లలో పడినా పాడవకుండా ఏళ్ల తరబడి భద్రంగా దాచుకునేలా ప్రత్యేక పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ ధ్రువ పత్రాలమన్నిక, భద్రతను పెంచే లక్ష్యంతో రూపొందించిన కొత్త మీసేవ సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుమంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రారంభించారు.15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో రూపొందించిన ఈ పేపర్ ద్వారా జారీ చేసే ధ్రువీకరణ పత్రాలు చిరిగిపోవడం, తడవడం వంటి సమస్యల నుంచి రక్షణ పొందనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, విజయ రమణారావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నకిలీలకు అడ్డుకట్ట

ప్రస్తుతం సాధారణ పేపర్లపై ఇచ్చే సర్టిఫికెట్లను



కలర్ జిరాక్స్ తీసి లేదా ఎడిట్ చేసి నకిలీవి సృష్టిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నారు. కొత్త పేపర్‌లో వాడే 15 రకాల భద్రతా ఫీచర్ల వల్ల అనధికారికంగా డూప్లికేట్ కాపీలు తయారు చేయడం సాధ్యం కాదు. ఒరిజినల్ సర్టిపికెట్‌ను, నకిలీ దాన్ని సులభంగా వేరుచేసి గుర్తించేలా ఇందులో ప్రత్యేక సాంకేతికత ఉంటుంది. మీసేవ కేంద్రాల్లో ప్రస్తుతం సర్టిఫికెట్ల జారీకి వినియోగిస్తున్న పేపర్ త్వరగా చినిగిపోవడం లేదా మడతలు పడి పాడవుతుంటాయి. కొత్త పేపర్‌ను ప్రత్యేక టెక్నాజీతో తయారు చేయడం వల్ల అంత సులభవంగా పాడవదని నిపుణులు అంటున్నారు. పేపర్ నాణ్యత వల్ల దశాబ్దాల పాటు భద్రపరుచుకోవచ్చు.

దళపతి విజయ్ రాకతో విజయవాడ

దద్దరిల్లింది


- బెజవాడలో విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమం
- ఒకే వేదికపై ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్

యువత ఉత్సాహాన్ని చూసి పులకించిన చంద్రబాబు

- విజయవాడ ఉత్సవాల వేదికగా గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రకటన
- ప్రధాని మోదీ నాయకత్వంలోనే ఐదు నదుల అనుసంధానం సాధ్యమని వెల్లడి
- యువత ఉత్సాహం చూస్తుంటే 2047 నాటికి భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుందని ధీమా
- రాష్ట్రాలు వేరైనా దేశాభివృద్ధే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రాకతో విజయవాడ నగరం దద్దరిల్లిపోతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్ 2.0' సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ్‌తో కలిసి ఆయన వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ఉద్విగ్నంగా ప్రసంగించారు. దుర్గమ్మ, భారత్ మాత, తెలుగు తల్లికి జయజయధ్వానాలు పలుకుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన, సభకు హాజరైన యువత ఉత్సాహాన్ని చూసి పులకించిపోయారు. "విజయ్ రాకతో మీ ఉత్సాహం చూస్తుంటే విజయవాడ దద్దరిల్లిపోతోంది" అంటూ సభికులను ఉత్తేజపరిచారు.తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దళపతి విజయ్ మొట్టమొదటిసారిగా మరో రాష్ట్రానికి వచ్చారని, ఆ గడ్డ ఎంతో విత్రమైన విజయవాడ కావడం, దుర్గమ్మ తల్లే ఆయన్ను ఇక్కడికి పిలిపించడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు.





తిరుమలలో సాధారణంగా

భక్తుల రద్దీ

- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 17 కంపార్ట్‌మెంట్లలో భక్తులు
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 83 వేలకు పైగా భక్తులు

తిరుమల(సామాన్యుడి అస్త్రం)

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైమ్ స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 17 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు.



ఆమ్రపాలి క్యాడర్

వివాదం

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది.రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది.

ప్రజలను అణచివేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్

- కేంద్ర ప్రభుత్వం ప్రజలను అణచివేస్తోంది
- ప్రజా వ్యతిరేక చర్యల్లో బీజేపీ తన బీ-టీం బీఆర్ఎస్‌నే అనుసరిస్తోంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

ప్రజలను అణచివేయడంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన తెలిపే జాబితా నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీనిపై పొంగులేటి స్పందించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ లాగే, కేంద్రంలో బీజేపీని కూడా ప్రజలు బొందపెడుతారన్నారు.మొన్న పేపర్ లీక్స్... నిన్న ప్రజల నిరసన హక్కును హరించడం..

సింహాలతో సీతక్క సవారీ

- దక్షిణాఫ్రికా పర్యటనలో మంత్రి సీతక్క
- సింహాల సఫారీలో వాటి వెంటే ధైర్యంగా నడిచిన దృశ్యాలు



హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ మంత్రి సీతక్క ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఆమె దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా సింహాల సఫారీకి వెళ్లగా, అక్కడ సింహాల వెంటే ఎంతో ధైర్యంగా నడుస్తున్న వీడియో ఒకటి ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఆమె సాహసాన్ని చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

పండుగ ప్రయాణికులకు గమనిక

750కి పైగా ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

పండుగ సీజన్ దృష్ట్యా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. దసరా, దీపావళి పండుగల సందర్భంగా 750కి పైగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే మార్గాల్లో ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

IRCTC

ఏపీకి వర్ష సూచన

- బంగాళాఖాతంలో ద్రోణి.. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు
- బుధవారం పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలకు అవకాశం



అమరావతి((సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. బంగాళాఖాతంపై ఏర్పడిన ద్రోణితో పాటు ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు నమోదవుతాయని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు.

విదేశీ శక్తులతో కలిసి

కమ్యూనిస్టుల కుట్ర

- కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ
- వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది.

హైదరాబాద్ నీటి సరఫరాపై

వదంతులు

- హైదరాబాద్‌లో నీటి కొరతపై వైరల్ అవుతున్న సందేశం అవాస్తవమన్న జలమండలి
- జలమండలి పేరుతో వాట్సాప్, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్ నగరంలో నీటి సరఫరాపై వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో తమ పేరుతో ప్రచారమవుతున్న సందేశం పూర్తిగా అవాస్తవమని హైదరాబాద్ జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) స్పష్టం చేసింది. ప్రజలు ఇలాంటి వదంతులను నమ్మవద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది.



ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల

- గెజిట్ నోటిఫికేషన్ల తర్వాతే ప్రకటన అంటున్న ఎస్ఈసీ పునేఠా
- 50 శాతం పరిమితికి లోబడే రిజర్వేషన్లను ఖరారు చేసిన ప్రభుత్వం
- బీసీలకు 34 శాతం కోటా పెంపు ఉత్తర్వులను కొట్టివేసిన హైకోర్టు

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. సంబంధిత ప్రభుత్వ శాఖలు గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా మంగళవారం స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం తమ సంసిద్ధతను తెలియజేసిన తర్వాత ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళతామని ఆయన తెలిపారు. నేడు ఆయన 20 రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించారు.సమావేశం అనంతరం పునేఠా మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సున్నితమైన, అత్యంత సున్నితమైన ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోటీ చేసే అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని రాజకీయ పార్టీలు కోరినట్లు ఆయన వెల్లడించారు. అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయడంతో సహా పలు కీలక సూచనలను పార్టీల ప్రతినిధులు తమకు అందజేశారని పునేఠా వివరించారు.



మీసేవ సర్టిఫికెట్లకు సరికొత్త రక్షణ కవచం

మొదటి పేజీ తరువాయి

2011 నుంచి 'మీసేవ'లో ప్రత్యేక పేపర్

తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు దీర్ఘకాలం భద్రపరచాల్సిన ఇతర ప్రభుత్వ పత్రాలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది.




ధ్రువపత్రాలకు మరింత భద్రత: మంత్రి శ్రీధర్‌బాబు

జనన, మరణ, విద్య, ఉద్యోగ తదితర సర్టిఫికెట్లు ఎంతో ముఖ్యమైనవని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతో పాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచే దిశగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని వివరించారు. కొత్త పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడంతో పాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లింది

మొదటి పేజీ తరువాయి

తమిళనాడును అభివృద్ధి చేయాలనే బలమైన పట్టుదలతో, కేవలం రెండేళ్లలోనే పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి విజయ్ అని కొనియాడారు. ఆయన పట్టుదల, అంకితభావం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.ఈ సందర్భంగా చంద్రబాబు జాతీయ రాజకీయాలు, నదుల అనుసంధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్రాలు వేరు కావచ్చు, కానీ మా అందరి అభిమతం ఒకటే. భారతదేశం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలు బాగుండాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏదైనా సాధ్యమేనని చెబుతూ, గోదావరి-కావేరి నదుల అనుసంధానం త్వరలోనే జరుగుతుందని ప్రకటించారు. "దుర్గమ్మ తల్లి సాక్షిగా, మన విజయవాడ నుంచే గోదావరి, కృష్ణమ్మ తల్లులు కలుస్తాయి. ఈ మహత్కార్యాన్ని నెరవేర్చగల ఏకైక నాయకుడు నరేంద్ర మోదీ" అని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులు అనుసంధానమై నాలుగు రాష్ట్రాలు సస్యశ్యామలం అవుతాయని వివరించారు.వేదిక కింద ఉన్న యువతను, వారి ఉత్సాహాన్ని చూస్తుంటే భారతదేశ భవిష్యత్తుపై తనకు సంపూర్ణ విశ్వాసం కలుగుతోందని చంద్రబాబు అన్నారు. "టెక్నాలజీ, నాలెడ్జ్‌తో భారత యువత ప్రపంచంలో ఏదైనా సాధించగలదు. మీ ఉత్సాహం చూశాక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టెక్నాలజీ, నాలెడ్జ్‌కు ఆధ్యాత్మికతను జోడించి ముందుకు సాగితే అనుకున్న



లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని, విజయవాడ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు ఆ ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. అనంతరం, వెండితెరపై కోట్లాది మంది అభిమానాన్ని చూరగొని, ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ప్రసంగించవలసిందిగా చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు.

విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర: కిషన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.



హైదరాబాద్ నీటి సరఫరాపై వదంతులు

మొదటి పేజీ తరువాయి

తాము ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదని బోర్డు స్పష్టీకరణ
ఎన్నినో ప్రభావంతో జలాశయాలు ఎండిపోతాయన్నది వదంతే
అధికారిక సమాచారాన్ని మాత్రమే

నమ్మాలని ప్రజలకు సూచన

ఈ సందేశం జలమండలి జారీ చేసినట్టుగా ఉండటంతో నగరవాసుల్లో ఆందోళన మొదలైంది.ఈ ప్రచారంపై స్పందించిన జలమండలి అధికారులు, తాము అలాంటి హెచ్చరికలు ఏవీ జారీ చేయలేదని స్పష్టం చేశారు. వైరల్ మెసేజ్‌లో పేర్కొన్న జలాశయాల నీటిమట్టాలు, సరఫరా పరిస్థితులకు సంబంధించిన సమాచారం అధికారికం కాదని తెలిపారు. తమ సంస్థ పేరుతో వచ్చే ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నీటి సరఫరాకు సంబంధించిన ఎలాంటి సమాచారం కోసమైనా బోర్డు అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.


ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల

మొదటి పేజీ తరువాయి

సమావేశం అనంతరం పునేఠా మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సున్నితమైన, అత్యంత సున్నితమైన ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోటీ చేసే అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని రాజకీయ పార్టీలు కోరినట్లు ఆయన వెల్లడించారు. అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయడంతో సహా పలు కీలక సూచనలను పార్టీల ప్రతినిధులు తమకు అందజేశారని పునేఠా వివరించారు.

50% కోటాకు లోబడే రిజర్వేషన్లు

రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఛైర్‌పర్సన్ పదవులకు ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్లను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ రిజర్వేషన్ల కేటాయింపులో భాగంగా మంగళగిరి-తాడేపల్లి మేయర్ పదవిని ఎస్టీకి, కర్నూలు (మహిళ), రాజమహేంద్రవరం (జనరల్) పదవులను ఎస్సీలకు కేటాయించారు. కాకినాడ (మహిళ), మచిలీపట్నం (మహిళ), ఏలూరు (జనరల్), అనంతపురం (జనరల్), చిత్తూరు (జనరల్) మేయర్ స్థానాలను బీసీలకు రిజర్వ్ చేశారు.విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ పదవులను మహిళా (జనరల్) కేటగిరీ కింద రిజర్వ్ చేశారు.



తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు మేయర్ స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా మిగిలాయి. రాష్ట్రంలోని 13 ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళలకు సీట్ల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ మున్సిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్ పి. సంపత్ కుమార్ అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు.

కోర్టు తీర్పులతో మారిన సమీకరణాలు

స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేయడంతో, మొత్తం రిజర్వేషన్లను 50 శాతానికే పరిమితం చేయాల్సి వచ్చింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదని హైకోర్టు అక్టోబర్ 1న ఇచ్చిన తీర్పులో స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా ప్రభుత్వానికి నిరాశే ఎదురైంది. అక్టోబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బీసీ కోటాను పెంచడానికి ప్రభుత్వం ఆధారపడిన డేటా, ముఖ్యంగా 'యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే'పై అత్యున్నత న్యాయస్థానం సందేహాలు వ్యక్తం చేసింది.2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 34 శాతానికి పెంచుతామని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కీలక హామీ ఇచ్చింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఆగస్టు 18న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే, కోర్టు తీర్పుల నేపథ్యంలో ఈ హామీ అమలుకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం 50 శాతం పరిమితికి లోబడే ప్రభుత్వం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయడంతో, ఎన్నికల నిర్వహణకు అడ్డంకులు తొలగిపోయాయి. ఎస్ఈసీ అధికారిక ప్రకటన కోసం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సింహాలతో సీతక్క సవారీ..



మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న వీడియో
ఆమె ధైర్యాన్ని కొనియాడుతున్న నెటిజన్లు
ఆదివాసీ నేపథ్యమే దీనికి కారణమంటూ ప్రశంసల వెల్లువ

మంత్రి సీతక్క ఇటీవల దక్షిణాఫ్రికాలో పర్యటించారు. అక్కడి తెలంగాణ సంఘం ఆహ్వానం మేరకు బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు ఆమె వెళ్లారు. దీంతో పాటు, ఎల్ నినో ప్రభావంతో తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, తక్కువ నీటితో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం చేయడానికి కూడా ఈ పర్యటనను ఉపయోగించుకున్నారు.తన అధికారిక పర్యటనలో భాగంగా ఆమె ఓ లయన్ సఫారీని సందర్శించారు. ఈ సందర్భంగా కొన్ని సింహాలు వారు ప్రయాణిస్తున్న వాహనం వద్దకు రావడం, ఆ తర్వాత సీతక్క చేతిలో ఓ కర్ర పట్టుకుని రెండు సింహాల వెనుక ఎంతో ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో నడుస్తూ కనిపించడం వంటి దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. ఈ క్లిప్‌ను ఆమె తన సోషల్ మీడియాలో పంచుకోవడంతో అది మరింత వేగంగా వ్యాపించింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు మంత్రి సీతక్క ధైర్యాన్ని కొనియాడుతున్నారు. ఆమె ఆదివాసీ నేపథ్యం, రాజకీయాల్లోకి రాకముందు నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన గతం వంటి అంశాలను గుర్తుచేసుకుంటూ, ఆ ధైర్యమే ఇక్కడ కనిపిస్తోందని కామెంట్లు పెడుతున్నారు. ఒకప్పుడు అడవుల్లో పోరాడిన ఆమె, ఇప్పుడు సింహాల మధ్య కూడా అంతే ధైర్యంగా నడవడంలో ఆశ్చర్యం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నత చదువులు (పీహెచ్‌డీ, లా) చదివి, ప్రజా జీవితంలోకి వచ్చిన ఆమె ప్రస్థానాన్ని అభినందిస్తున్నారు.

పండుగ ప్రయాణికులకు గమనిక..

IRCTC

మొదటి పేజీ తరువాయి

అవసరాన్ని బట్టి రైళ్ల సంఖ్యను పెంచుతామని వెల్లడి
ప్రత్యేక రైళ్లలో మూడో వంతు అదనపు ఛార్జీల వసూలు
రైల్వే స్టేషన్లలో అదనపు టికెట్ కౌంటర్లు, సీసీ కెమెరాల నిఘా

ఈ వివరాలను దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ శ్రీధర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. ప్రయాణికుల అవసరాలు, రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్యను మరింత పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు. పండుగల వేళ ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు, భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ద్వారా నిఘాను కట్టుదిట్టం చేసినట్లు పేర్కొన్నారు.అయితే, ఈ ప్రత్యేక రైళ్లలో ప్రయాణించే వారు సాధారణ ఛార్జీల కంటే కొంత అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైళ్లలో మూడో వంతు మేర అదనపు ఛార్జీని వసూలు చేయనున్నట్లు రైల్వే శాఖ స్పష్టం చేసింది. పండుగలకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ మార్పును గమనించి, అందుకు అనుగుణంగా తమ ప్రయాణాల ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజలను అణచివేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి

మొన్న పేపర్ లీక్స్... నిన్న ప్రజల నిరసన హక్కును హరించడం... ప్రజా వ్యతిరేక చర్యల్లో బీజేపీ తన బీ-టీం బీఆర్ఎస్‌నే అనుసరిస్తోందని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్‌లో నిరసనలను నిషేధించిన బీఆర్?ఎస్? పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు.ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశమంతా నిరసన గళం వినిపిస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలకు వేదికైన జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడం సరికాదన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణికి నిదర్శనమన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల సాధన కోసం సాగుతున్న పోరాటం ఆగదన్నారు.



కనెక్షన్లు పెరిగాయి..

నీటి కోటా మాత్రం పెరగదా?

■ మియాపూర్ సర్కిల్‌ను ట్యాంకర్లకు వదిలేసిన వాటర్‌బోర్డు ■ నగర అవసరం 735 ఎంజీడీలు.. సరఫరా 585 ఎంజీడీలే ■ అత్యధిక ట్యాంకర్ డిమాండ్ ప్రాంతాల్లో హఫీజ్‌పేట్ ■ ఆరు వార్డులకు నీటి కేటాయింపు, ఒత్తిడి వివరాలు మాత్రం బహిర్గతం కావు

సామాన్యుడి అస్త్రం / మియాపూర్ :

అపార్ట్‌మెంట్లు పెరిగాయి. కొత్త కనెక్షన్లు వచ్చాయి. జనాభా లక్షల్లో చేరింది. కానీ మియాపూర్ సర్కిల్‌లో తాగునీటి సరఫరా వ్యవస్థ మాత్రం పెరిగిన అవసరానికి అనుగుణంగా విస్తరించలేదు. ఫలితంగా హఫీజ్‌పేట్, మదీనాగూడ, చందానగర్, దీప్తిశ్రీనగర్, మియాపూర్, మక్తా మహబూబ్‌పేట్ ప్రాంతాల్లో నివాసితులు నల్లా నీటి కంటే బోరు, ప్రైవేటు లేదా వాటర్‌బోర్డు ట్యాంకర్లపైనే ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో రోజువారీ తాగునీటి అవసరం సుమారు 735 మిలియన్ గ్యాలన్లు కాగా, వాటర్‌బోర్డు అందిస్తున్నది 585 ఎంజీడీలేనని అక్టోబర్ 12న వెలువడిన తాజా గణాంకాలు చెబుతున్నాయి. అంటే రోజుకు 150 ఎంజీడీల లోటు ఉంది. పాత పైప్‌లైన్లు, పరిమిత నిల్వ సామర్థ్యం, వేగంగా పెరిగిన జనాభానే ఈ లోటుకు కారణమని వాటర్‌బోర్డు సీనియర్ అధికారి అంగీకరించారు.ఈ పరిస్థితి మియాపూర్ సర్కిల్‌కు మరింత కీలకం. ఎందుకంటే ఏప్రిల్‌లోనే హఫీజ్‌పేట్‌ను అత్యధిక ట్యాంకర్ డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో ఒకటిగా వాటర్‌బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలో కేవలం 48 వేల మంది వినియోగదారులే మొత్తం వాటర్‌బోర్డు ట్యాంకర్ వినియోగంలో దాదాపు 80 శాతం వాటాను కలిగి ఉన్నారని అధికారులు వెల్లడించారు. 1,123 ట్యాంకర్ల ద్వారా 105 రోజుల్లో 6,19,743 ట్రిప్పులు నడిఎ నట్లు చెప్పారు. అయినప్పటికీ హఫీజ్‌పేట్, మియాపూర్, మదీనాగూడ వార్డుల్లో ఎన్నెన్ని ట్యాంకర్లు బుక్ అయ్యాయి, సగటు నిరీక్షణ సమయం ఎంత, పైప్‌లైన్ ద్వారా రోజుకు ఎంత నీరు అందుతోంది అనే స్థానిక వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచలేదు.ఇదే అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. సమస్య ఉన్నదని శాఖకు తెలుసు. ట్యాంకర్ డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలూ తెలుసు. అదనపు నీటిని వెంటనే అందించడం సాధ్యం కాదని కూడా గతంలో ప్రకటించింది. అయినా వార్డులవారీ నీటి కేటాయింపు, సరఫరా గంటలు, పైప్‌లైన్ ఒత్తిడి, లీకేజీలు, ట్యాంకర్ బుకింగులు, పెండింగ్ కనెక్షన్లతో కూడిన పబ్లిక్ డ్యాష్‌బోర్డు ఇప్పటికీ లేదు. నీళ్లు రాకపోతే వినియోగదారుడు ఫిర్యాదు చేయాలి; ట్యాంకర్ బుక్ చేసుకోవాలి; ఎప్పుడు వస్తుందో ఎదురు చూడాలి. కానీ సరఫరా వ్యవస్థను ముందుగానే బలోపేతం చేయాల్సిన అధికారులు మాత్రం సమస్య వచ్చిన తర్వాత స్పందించే విధానాన్నే కొనసాగిస్తున్నారు.నగరవ్యాప్తంగా ట్యాంకర్ బుకింగులు ఫిబ్రవరిలో రోజుకు ఐదు వేల కంటే తక్కువగా ఉండగా, జూన్ ప్రారంభానికి 20 వేలకు పైగా పెరిగినట్లు మరో నివేదిక వెల్లడించింది. మే నెలలోనే 3.36 లక్షల బుకింగులు నమోదయ్యాయి. గత వేసవిలో నాలుగు వేల అపార్ట్‌మెంట్లు వాటర్‌బోర్డు ట్యాంకర్లపై ఆధారపడితే, ఈ ఏడాది వాటి సంఖ్య 12,500కు పెరిగింది.అక్టోబర్ 13న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించిన సమీక్షలో నవంబర్ నుంచి మల్లన్నసాగర్ ద్వారా అదనంగా 20 ఎంజీడీలు అందిస్తామని, మొత్తంగా మరో 60 ఎంజీడీలను సమకూర్చే ప్రణాళిక ఉందని ప్రకటించారు. అయితే ఈ అదనపు నీటిలో మియాపూర్ సర్కిల్‌కు ఎంత కేటాయిస్తారు? ఏ రిజర్వాయర్ నుంచి ఏ వార్డుకు నీరు వెళుంది? సరఫరా వ్యవధి పెరుగుతుందా? ట్యాంకర్ అవసరం తగ్గుతుందా? అనే ప్రశ్నలకు సమాధానం లేదు.అందువల్ల ఇది కేవలం వర్షాభావం వల్ల ఏర్పడిన సమస్యగా కొటిపారేయలేం. నిర్మాణ అనుమతులు, కొత్త నీటి కనెక్షన్లు, జనాభా పెరుగుదలతో సమానంగా రిజర్వాయర్లు, ఫీడర్ మెయిన్లు, పంపింగ్ సామర్థ్యం, పంపిణీ పైప్‌లైన్లను పెంచకపోవడం పరిపాలనా నిర్లక్ష్యమే. నల్లాలో నీరు రాని ప్రతి ఇంటికీ ట్యాంకర్ పంపడం పరిష్కారం కాదు. మియాపూర్ సర్కిల్‌కు ప్రత్యేక నీటి భద్రతా ప్రణాళికను ప్రకటించాల్సిన బాధ్యత వాటర్‌బోర్డుపై ఉంది.



రోజుకు నాలుగుసార్లు చీకటే..

నిరంతరాయ విద్యుత్

■ చందానగర్ నుంచి మియాపూర్--మయూరినగర్ వరకు విద్యుత్ అంతరాయాలు

■ ఫిర్యాదు నంబర్లతో సరిపెడుతున్న అధికారులు.. ఫీడర్ ఆడిట్ ఎక్కడ?

చందానగర్ హుడా కాలనీలో తరచూ విద్యుత్ అంతరాయాలపై నివాసితుల ఆవేదన

■ మియాపూర్‌కు ఆనుకుని ఉన్న మయూరినగర్‌లోనూ సరఫరా స్థితిపై ఫీడర్‌వారీ లెక్కలు లేవు

■ ఫిర్యాదు నమోదవుతోంది.. కానీ కారణం, పునరుద్ధరణ సమయం, శాశ్వత పరిష్కారం వెల్లడి కావడం లేదు

సామాన్యుడి అస్త్రం / సైబరాబాద్ బ్యూరో :

విద్యుత్ పోయిన ప్రతిసారీ 1912కు ఫోన్ చేయడం.. ఫిర్యాదు నంబరు తీసుకోవడం.. సిబ్బంది త్వరలో వస్తారు అనే సమాధానం వినడం మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, మదీనాగూడతోపాటు మయూరినగర్ ప్రాంత ప్రజలకు పరిపాటిగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రణాళిక లేని అంతరాయాలు, లోవోల్టేజ్, కేబుల్ సమస్యలతో ఐటీ ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, అపార్ట్‌మెంట్ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అక్టోబర్ 1న ప్రచురితమైన స్థానిక కథనం ప్రకారం చందానగర్ హుడా కాలనీకి చెందిన ఐటీ ఉద్యోగి రవికాంత్ తమ ప్రాంతంలో రోజుకు నాలుగుసార్లయినా విద్యుత్ పోతోందని తెలిపారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే ఉద్యోగులు ఇంటర్నెట్, కంప్యూటర్లు, యూపీఎస్‌లపై ఆధారపడటంతో కొద్దిసేపు విద్యుత్ నిలిచినా పని దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే కథనం ప్రకారం గ్రేటర్ హైదరాబాద్‌లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఒకరోజు 4,072 మెగావాట్లకు, సెప్టెంబర్ 15న 4,176 మెగావాట్లకు చేరింది.

మయూరినగర్ పరిధిపై స్పష్టత ఇదీ

స్థానికంగా “మియాపూర్ మయూరినగర్”గా పిలిచినా, ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలనా విభజన ప్రకారం మయూరినగర్ వార్డు--242, మాధాపూర్ సర్కిల్, కూకట్‌పల్లి జోన్ పరిధిలోకి వస్తుంది. మియాపూర్ సర్కిల్‌లో హఫీజ్‌పేట్, మదీనాగూడ, చందానగర్, దీప్తిశ్రీనగర్, మియాపూర్, మక్తా మహబూబ్‌పేట్ వార్డులు ఉన్నాయి. మయూరినగర్‌ను మియాపూర్ సర్కిల్‌లో చూపడం సరికాదు.అయితే మున్సిపల్ సర్కిల్ పరిధి మారినంత మాత్రాన విద్యుత్ సరఫరా సెక్షన్, సబ్‌స్టేషన్, ఫీడర్ పరిధులు కూడా అదే విధంగా మారాయని భావించలేం. మయూరినగర్‌లోని ఏ కాలనీ ఏ టీజీఎస్‌పీడీసీఎల్ సెక్షన్, ఏ



33/11 కేవీ సబ్‌స్టేషన్, ఏ 11 కేవీ ఫీడర్‌కు అనుసంధానమై ఉందో వినియోగదారుడి సర్వీస్ నంబరు లేదా విద్యుత్ బిల్లు ఆధారంగా నిర్ధారించాలి. ఈ పరిధి వివరాలను టీజీఎస్‌పీడీసీఎల్ కాలనీలవారీగా ప్రకటించకపోవడంతో సమస్య వచ్చినప్పుడు ఎవరిని సంప్రదించాలో ప్రజలకు స్పష్టత ఉండడం లేదు.విద్యుత్ డిమాండ్ పెరిగిందనేది వాస్తవమే. కానీ డిమాండ్ పెరుగుతుందని ముందుగానే అంచనా వేసి ట్రాన్స్‌ఫార్మర్లు, 11 కేవీ ఫీడర్లు, కేబుళ్లు, రింగ్‌మెయిన్ యూనిట్లు, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను సిద్ధం చేయాల్సిన బాధ్యత విద్యుత్ శాఖదే. ప్రతి అంతరాయం తర్వాత ఫ్యూజ్ మార్చడం, తెగిన కేబుల్‌ను మరమ్మతు చేయడం మాత్రమే నిర్వహణ కాదు. ఒకే ప్రాంతంలో పదేపదే సరఫరా నిలిచిపోతుంటే మూలకారణాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలి.టీజీఎస్‌పీడీసీఎల్ అధికారిక సోషల్‌మీడియా ప్రతిస్పందనలో మియాపూర్ సెక్షన్‌కు సంబంధించిన ఒక ఫిర్యాదును ఌ2610743164 నంబరుతో నమోదు చేసి, సంబంధిత బృందం సమస్యను పరిశీలిస్తుందని పేర్కొంది. అయితే ఆ ఫిర్యాదు ఏ కాలనీకి సంబంధించినది, విద్యుత్ ఎప్పుడు నిలిచింది, ఎంత సమయంలో పునరుద్ధరించారు, అంతరాయానికి సాంకేతిక కారణమేంటి అనే పూర్తి వివరాలు బహిరంగంగా అందుబాటులో లేవు.ఇదే అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. ఫిర్యాదును స్వీకరించడం ఒక్కటే బాధ్యత కాదు. దానిని పరిష్కరించడానికి పట్టిన సమయం, అదే ఫీడర్‌పై గతంలో నమోదైన అంతరాయాలు, మరమ్మతు చేసిన పరికరం, మళ్లీ సమస్య రాకుండా తీసుకున్న చర్యలను కూడా వెల్లడించాలి. వినియోగదారుడికి రిజాల్వ్‌అనే సందేశం పంపి ఫిర్యాదును మూసివేయడం కాకుండా, పునరావృత అంతరాయానికి మూలకారణ నివేదిక ఇవ్వాలి.మియాపూర్ సర్కిల్‌తోపాటు మయూరినగర్‌లో విద్యుత్ నిర్వహణ బాధ్యతలు ఏ సెక్షన్లకు చెందుతాయో స్పష్టమైన మ్యాప్‌ను టీజీఎస్‌పీడీసీఎల్ విడుదల చేయాలి. అధికారిక జాబితాలో చందానగర్ ఫాల్ట్ కంట్రోల్ సెంటర్ నంబరు 8712469655, హఫీజ్‌పేట్ ఎఫ్ఓసీ నంబరు 8712469657గా ఉన్నాయి. కానీ మయూరినగర్ వినియోగదారులు ఏ ఎఫ్ఓసీకి ఫిర్యాదు చేయాలి, ఏ అసిస్టెంట్ ఇంజినీర్ బాధ్యత వహిస్తారు అనే సమాచారం కాలనీ స్థాయిలో కనిపించడం లేదు.టీజీఎస్‌పీడీసీఎల్ 1912 కాల్‌సెంటర్, ఆన్‌లైన్ “నో పవర్ కంప్లైంట్” సదుపాయం నిర్వహిస్తోంది. రిఫరెన్స్ నంబరు ద్వారా ఫిర్యాదు స్థితిని తెలుసుకోవచ్చు. కానీ మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, మదీనాగూడ, మయూరినగర్ ప్రాంతాల్లో రోజువారీగా వచ్చిన ఫిర్యాదుల సంఖ్య, సగటు పరిష్కార సమయం, ఫీడర్‌వారీ అంతరాయాల వ్యవధి వంటి పనితీరు వివరాలను బహిర్గతం చేయడం లేదు.అధికారిక సమాచార పుస్తకంలో ఆపరేషన్ సర్కిళ్లు నిర్వహణ, మరమ్మతులు, వినియోగదారుల సేవలకు బాధ్యత వహిస్తాయని టీజీఎస్‌పీడీసీఎల్ పేర్కొంది. సబ్‌స్టేషన్ల విద్యుత్ సరఫరాను ఎస్పీడీఏ విభాగం పర్యవేక్షిస్తుందని కూడా తెలిపింది. అంటే ఫీడర్‌వారీ అంతరాయాల సమాచారం శాఖ వద్ద ఉండాల్సిందే. ఆ సమాచారాన్ని ప్రజలకు వెల్లడించకపోవడం పారదర్శకత లోపం; పునరావృత అంతరాయాలను కేవలం వ్యక్తిగత ఫిర్యాదులుగా పరిష్కరించడం నిర్వహణ నిర్లక్ష్యం.మియాపూర్ సర్కిల్‌తోపాటు మయూరినగర్‌ను కలుపుకొని సంబంధిత 11 కేవీ ఫీడర్లపై గత ఆరు నెలల ట్రిప్పింగులు, కేబుల్ వైఫల్యాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్లు, ఫ్యూజ్ సమస్యలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలి. లోడ్ పెరుగుదలకు అనుగుణంగా వ్యవస్థను బలోపేతం చేయాలి. నిరంతరాయ విద్యుత్ ప్రకటనల్లో కాదు---ఇళ్లలో కనిపించాలి.

ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?: కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం



ప్రజాస్వామ్య హక్కులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్న కిషన్ రెడ్డి

ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనలను అడ్డుకోవడం లేదన్న కేంద్ర మంత్రి

తెలంగాణలో బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, అక్టోబర్13(రియల్ అడ్వైజర్)

ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు.తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నా ఆయన హక్కులను కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు.ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులు... తెలంగాణలోని బీజేపీ నేతలకు ఎందుకు ఉండవు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దానిని ఆచరించాలని హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన గుర్తుచేశారు.

లంచం కేసులో తహసీల్దార్, సర్వేయర్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు



అబ్దుల్లాపూర్‌మెట్‌లో తహసీల్దార్, సర్వేయర్ అరెస్ట్

భూమి సర్వే కోసం ?20 లక్షల లంచం డిమాండ్

డబ్బులు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ సర్వేయర్

తహసీల్దార్ ఆదేశాలతోనే లంచం తీసుకున్నట్లు సర్వేయర్ వెల్లడి

ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్న ఏసీబీ అధికారులు

హైదరాబాద్, అక్టోబర్13(రియల్ అడ్వైజర్)

హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన దాడుల్లో తహసీల్దార్, సర్వేయర్ పట్టుబడ్డారు. భూమి సర్వేకు సంబంధించి ఓ వ్యక్తి నుంచి రూ.20 లక్షలు లంచం తీసుకుంటుండగా సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళ్తే.. ఒక భూమికి సంబంధించి సర్వే నిర్వహించి, హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ (జేఐఆర్) అందజేసేందుకు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి, మండల సర్వేయర్ బటుక శ్రీనివాసులు లంచం డిమాండ్ చేశారు. ఇందుకోసం తొలుత రూ.30 లక్షలు అడగగా, చివరకు రూ.20 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది.బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. ఒప్పందం ప్రకారం బాధితుడి నుంచి సర్వేయర్ శ్రీనివాసులు రూ.20 లక్షల నగదు తీసుకుంటుండగా అధికారులు అతడిని పట్టుకున్నారు. సదరు నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, శ్రీనివాసులు చేతులకు కెమికల్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.ఏసీబీ విచారణలో, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకే తాను లంచం తీసుకున్నట్లు సర్వేయర్ అంగీకరించాడు. దీంతో అధికారులు తహసీల్దార్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి, నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు

కేంద్రం గ్రీన్ సిగ్నల్

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ
ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం
కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సానుకూల స్పందన



హైదరాబాద్, అక్టోబర్13(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలోని పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై చర్చించగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గడ్కరీ ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తీరనున్నాయి. వీటితో పాటు, కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా ఆయన సానుకూలత వ్యక్తం చేశారు.తెలుగు రాష్ట్రాలను కలిపే హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనపై కూడా గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఇదే క్రమంలో, నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఇండియన్ రోడ్' కాంగ్రెస్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని గడ్కరీని ఆయన ఆహ్వానించారు.

బెంగళూరు పబ్‌లో రగడ..

ఏపీ ఐఏఎస్ అధికారిపై క్రిమినల్ కేసు!



బెంగళూరు పబ్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఏపీ ఐఏఎస్ అధికారి
అధికారి వికాస్ మర్మత్‌తో పాటు ఆయన స్నేహితులపై క్రిమినల్ కేసు నమోదు
సీఎం నియోజకవర్గం కుప్పం అభివృద్ధి ప్రాధికార సంస్థ పీడీగా బాధ్యతలు

అమరావతి,అక్టోబర్13,(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ బెంగళూరులో తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. నగరంలోని ఓ పబ్‌లో పోలీసు విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలపై ఆయనతో పాటు ఆయన స్నేహితులపై అక్కడి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లగా, దీనిపై ఆయన తీవ్రంగా స్పందించి, పూర్తిస్థాయి విచారణ జరపాలని సీఎస్ ను ఆదేశించినట్టు తెలుస్తోందివివరాల్లోకి వెళితే, అక్టోబర్ 9వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత బెంగళూరు రెసిడెన్సీ రోడ్డులోని 'కావోర్ బార్ అండ్ రెస్టారెంట్'లో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) పోలీసులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా సమయం దాటినా పబ్ నడుపుతుండటంతో పాటు, వయసు నిర్ధారణ కోసం అక్కడ ఉన్న వారి ఐడీ కార్డులను పరిశీలిస్తున్నారు. ఆ సమయంలో అక్కడే స్నేహితులతో ఉన్న వికాస్ మర్మత్, పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది.మద్యం మత్తులో ఉన్న ఆయన, పోలీసులను దూషించడమే కాకుండా, వారిపై దాడికి ప్రయత్నించి విధులకు ఆటంకం కలిగించారని సీసీబీ ఇన్‌స్పెక్టర్ అరుణ్ సాలుంకే ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో వికాస్ మర్మత్‌తో పాటు ఆయన స్నేహితులు అభయ్, ఉదయ్ సింగ్, నితీష్, రోషన్‌లపై వివిధ సెక్షన్ల కింద కేసు (క్రైమ్ నం. 150/2026) నమోదు చేశారు.వికాస్ మర్మత్ 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఖూణూా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడం గమనార్హం. ఉన్నత హోదాలో ఉన్న అధికారి ఇలాంటి వివాదంలో చిక్కుకోవడంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను సిద్ధం చేయనున్నారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

రైతులకు మంచి చేస్తుంటే జగన్‌కు కడుపుమంట

రైతుల సంక్షేమం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శ
జగన్ ఎగ్గొట్టిన రూ.1700 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించామన్న ఏలూరి
కూటమి ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ
సీహెచ్‌సీల నిధులు దారి మళ్లించి జగన్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణ
తప్పుడు ప్రచారాలతో రైతులను మోసం చేయలేరని హితవు

అమరావతి,అక్టోబర్13,(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో రైతులకు మేలు జరుగుతుంటే మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఓర్వలేకపోతున్నారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాతలకు అండగా నిలుస్తుంటే, ఆ సంక్షేమాన్ని చూసి జగన్ అసూయతో రగిలిపోతున్నారని ఆయన ధ్వజమెత్తారు.ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ.. "ప్రతి పంటకు



మద్దతు ధర కల్పిస్తూ సీఎం చంద్రబాబు రైతాంగానికి దన్నుగా నిలుస్తున్నారు. కందులు, మినుములు, టమోటా, పత్తి, పొగాకు వంటి వివిధ పంటలకు రూ.800 కోట్ల మేర మద్దతు ధర కల్పించి ఆదుకున్నాం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.1,944.43 కోట్లతో 1,50,747 మంది రైతుల నుంచి 2.84 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వం సేకరించింది" అని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన జాప్యాన్ని ప్రస్తావిస్తూ.. "వైసీపీ హయాంలో రూ.1,700 కోట్ల ధాన్యం కొనుగోలు నిధులను చెల్లించకుండా లక్ష మంది రైతుల పొట్టకొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పెండింగ్ బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేసి వారిని ఆదుకుంది. ఈ రెండేళ్లలోనే రూ.1,078.34 కోట్ల విలువైన కందులు, రూ.617.69 కోట్ల విలువైన శనగలు, పెసలను ప్రభుత్వం కొనుగోలు చేసింది" అని తెలిపారు.జగన్ పాలనలో జరిగిన అవకతవకలపై ఏలూరి తీవ్ర ఆరోపణలు చేశారు. "కస్టమ్ హైరింగ్ సెంటర్ల (జఒజ) పేరుతో జగన్ రెడ్డి రూ.367.38 కోట్ల నిధులను దారి మళ్లించి, వ్యవసాయ యంత్రాలను మాయం చేశారు. గొడ్డలి పార్టీకి రైతుల సంక్షేమం పట్టడం లేదు" అని విమర్శించారు.కూటమి ప్రభుత్వ చర్యలను వివరిస్తూ.. "వరి పంట నష్టపరిహారాన్ని రూ.17,000 నుంచి రూ.25,000కు పెంచాం. రూ.310 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని 2 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేసి అండగా నిలిచాం. రాబోయే ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకొని 15 శాతం రివాల్వింగ్ ఫండ్, రూ.300 కోట్ల ధరల స్థిరీకరణ నిధి కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. వాస్తవాలను దాచిపెట్టి, తప్పుడు ప్రచారాలతో రైతులను మోసం చేయలేరని జగన్ గ్రహించాలి. రైతులను ఆదుకుని, వారికి భరోసా కల్పించింది కూటమి ప్రభుత్వమే" అని ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు.

ఏపీలో జిల్లా పరిషత్ చైర్మన్ల రిజర్వేషన్లు ఇవే!



రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ చైర్మన్లకు రిజర్వేషన్లు ఖరారు
పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ ఉత్తర్వులు జారీ
ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు మహిళలకు గణనీయమైన ప్రాధాన్యత
త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు మార్గం సుగమం
రాజకీయ పార్టీలలో మొదలైన జడ్పీ పీఠాల సమీకరణాలు

అమరావతి,అక్టోబర్13,(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల రాజకీయాలు కీలక దశకు చేరుకున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లా పరిషత్ (జడ్పీ) ఛైర్మన్ పదవులకు ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ మంగళవారం అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది.గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల్లో జిల్లా పరిషత్‌లది అత్యంత కీలకమైన పాత్ర. ఈ నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ పదవుల రిజర్వేషన్ల ఖరారుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. జనాభా ప్రాతిపదికన, రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు మహిళలకు రిజర్వేషన్లు కేటాయించడం ద్వారా సామాజిక న్యాయం పాటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మొత్తం 28 స్థానాల్లో సామాజిక వర్గాల వారీగా చూస్తే, షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) 5 స్థానాలు, షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) 3, వెనుకబడిన తరగతులకు (బీసీ) 6 స్థానాలు దక్కాయి. మిగిలిన 14 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉంచారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, అన్ని కేటగిరీలలో కలిపి మొత్తం 14 స్థానాలను మహిళలకే కేటాయించడం విశేషం.ఈ రిజర్వేషన్ల ప్రకటనతో రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలలో సందడి మొదలైంది. ఆయా జిల్లాల్లో రిజర్వేషన్లకు అనుగుణంగా ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయనున్నారు.

జిల్లాల వారీగా రిజర్వేషన్ల పూర్తి వివరాలు:

ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు:
తిరుపతి -- ఎస్సీ మహిళ
గుంటూరు -- ఎస్సీ మహిళ
కోనసీమ -- ఎస్సీ మహిళ
ఎన్టీఆర్ -- ఎస్సీ
ప్రకాశం -- ఎస్సీ
పోలవరం -- ఎస్టీ మహిళ
అల్లూరి సీతారామరాజు -- ఎస్టీ
పార్వతీపురం మన్యం -- ఎస్టీ
బీసీ కేటగిరీలు:
అనకాపల్లి -- బీసీ మహిళ
శ్రీకాకుళం -- బీసీ మహిళ
విజయనగరం -- బీసీ మహిళ
విశాఖపట్నం -- బీసీ
అనంతపురం -- బీసీ
కర్నూలు -- బీసీ

అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలు:

మహిళలు: కృష్ణా, పల్నాడు, తూర్పుగోదావరి, బాపట్ల, కాకినాడ, చిత్తూరు, ఏలూరు.
జనరల్: నెల్లూరు, అన్నమయ్య, మార్కాపురం, నంద్యాల, శ్రీసత్యసాయి, పశ్చిమగోదావరి, వైఎస్ఆర్ కడప.

ఏపీలో స్థానిక ఎన్నికలకు నేడు షెడ్యూల్ విడుదల


ఏపీలో స్థానిక సమరానికి మోగిన నగారా!
మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు!
తొలి విడతలో మున్సిపల్ ఎన్నికలు
విజయవాడలో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు

అమరావతి,అక్టోబర్13,(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) షెడ్యూల్‌ను ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం ఉదయం 11:30 గంటలకు విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి, పూర్తి షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేయనున్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొంది.మొత్తం మూడు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నట్టు తెలుస్తోంది. తొలి విడతలో పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా బుధవారమే విడుదల చేసే అవకాశాలున్నాయి. రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత మూడో విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఈసీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు సమాచారం.ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని జిల్లాల నుంచి గెజిట్ నోటిఫికేషన్లు ఇప్పటికే ఎన్నికల సంఘానికి చేరాయి

ఏపీ స్థానిక సమరం

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల వేళ ఎన్డీయేలో జోరందుకున్న సీట్ల పంపకాల చర్చలు
ముందుగా జనసేనతో డీల్ ఖరారు చేసి, ఆపై బీజేపీతో చర్చించాలని చంద్రబాబు నిర్ణయం
తమ త్యాగాలకు గుర్తింపుగా తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరిన పవన్
మంగళవారం రాత్రి సీఎం నివాసంలో టీడీపీ, జనసేన నేతల తుది భేటీ




అమరావతి,అక్టోబర్13(సామాన్యుడి అస్త్రం))

అక్టోబర్ 14న నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో చర్చల్లో పెరిగిన వే
ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై మంతనాలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం నాడు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల మధ్య చర్చలు తారాస్థాయికి చేరాయి. కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అక్టోబర్ 14న ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చన్న అంచనాల నేపథ్యంలో, ఆ లోపే పంపకాలను పూర్తి చేసి ఐక్యంగా బరిలోకి దిగాలని కూటమి భావిస్తోంది.ఈ క్రమంలో భాగంగా నేడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ముఖ్యమంత్రి చంద్రబాతో సమావేశమయ్యారు. రెండు రోజుల్లో వీరి మధ్య ఇది రెండో దఫా చర్చలు కావడం గమనార్హం. అయితే, బీజేపీతో చర్చలను కొలిక్కితెచ్చే ముందు, జనసేనకు కేటాయించాల్సిన సీట్లపై ఒక స్పష్టతకు రావాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం, పల్లా శ్రీనివాసరావు, నిమ్మల రామానాయుడు నేరుగా జనసేన కార్యాలయానికి వెళ్లి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో జనసేన తరపున మంత్రి నాదెండ్ల మనోహర్, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.తాజా సమాచారం ప్రకారం, మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో టీడీపీ, జనసేన నేతలు మరోసారి భేటీ కానున్నారు. ఈ సమావేశంలోనే సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన నగరపాలక సంస్థల మేయర్ అభ్యర్థుల ఎంపికపైనా ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన, బీజేపీలు తమ బలాబలాల ఆధారంగా ఆశిస్తున్న స్థానాల జాబితాను చంద్రబాబుకు అందజేశాయి. పార్టీల గెలుపు అవకాశాలను బట్టి సీట్ల కేటాయింపు ఉంటుందని కూటమి వర్గాలు చెబుతున్నాయి. గత వారం కూడా చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య సీట్ల పంపకాలు, ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.ఈ చర్చల నేపథ్యంలో, అక్టోబర్ 11న పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కూటమి ఏర్పాటు, విజయం కోసం జనసేన, జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని, ఆ త్యాగాలకు గుర్తింపుగా మిత్రధర్మాన్ని అనుసరించి స్థానిక సంస్థల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. “2024 ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడాం. ఇప్పుడు జరగబోయే స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని ఆశిస్తున్నాను” అని ఆయన పేర్కొన్నారు. 2014లో కూడా జనసైనికులు త్యాగాలు చేశారని పవన్ తెలిపారు. “2014లో కూటమికి మద్దతుగా నిలిచినప్పుడు ఒక్క జనసైనికుడు కూడా పదవి ఆశించలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని నిస్వార్థంగా పనిచేశారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ కోసం, కూటమి కోసం ఎన్నో త్యాగాలు చేశారు” అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా, స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ శ్రేణులకు న్యాయం జరగాలనే సంకేతాన్ని పవన్ బలంగా పంపారు. దీంతో సర్దుబాటు ప్రక్రియలో జనసేన డిమాండ్లకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి గుడ్ న్యూస్..

వివిధ కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవుల కాలపరిమితి పొడిగింపు
మరో రెండు నెలల పాటు పదవీకాలం పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
సంక్షేమ, అభివృద్ధి పనుల కొనసాగింపు కోసమే ఈ నిర్ణయం అన్న ప్రభుత్వం



అమరావతి,అక్టోబర్13((సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ కార్పొరేషన్లు, బోర్డులు, ఇతర సంస్థల్లో నామినేటెడ్ పోస్టుల పదవీకాలాన్ని మరో రెండు నెలల పాటు పొడిగించింది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు తమ విధుల్లో కొనసాగనున్నారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పాలనాపరమైన అభివృద్ధి పనుల అమలుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వాటిని మరింత వేగవంతం చేసే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం పదవుల్లో ఉన్న నేతల పనితీరు, శాఖల మధ్య సమన్వయం ఆధారంగా ఈ పొడిగింపు వర్తిస్తుందని తెలుస్తోంది.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై పలువురు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఈ పొడిగింపు కాలంలో ప్రజాసేవలో మరింత చురుగ్గా పనిచేస్తామని వారు తెలిపారు. ఈ పొడిగింపుతో అభివృద్ధి పనుల కొనసాగింపునకు మార్గం సుగమం అయిందని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం

బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారంటూ వైసీపీపై మంత్రి విమర్శలు
రిజర్వేషన్లతో పాటు పార్టీ టికెట్లతో 40 శాతం లక్ష్యం సాధిస్తామన్న కొల్లు రవీంద్ర
బీసీ నాయకత్వానికి రక్షణగా త్వరలో బీసీ రక్షణ చట్టం
గత ప్రభుత్వ నిర్ణయంతో 16,800 పదవులు కోల్పోయిన బీసీలు



అమరావతి,అక్టోబర్13((సామాన్యుడి అస్త్రం)

గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు కోత విధించి వారిని రాజకీయంగా అణచివేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం కల్పిస్తూ వారికి భరోసా ఇస్తోందని రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల నాయకత్వానికి తగిన రక్షణ కల్పించేలా త్వరలోనే ‘బీసీ రక్షణ చట్టం’ తీసుకురానున్నట్లు ఆయన కీలక ప్రకటన చేశారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా, సామాజికంగా ప్రత్యేక గుర్తింపు లభించిందని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు. నాడు ఎన్టీ రామారావు.. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచారని వివరించారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం, బీసీలు టీడీపీకి అండగా ఉన్నారనే అక్కసుతోనే రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. కావాలనే తమ అనుయాయులతో కోర్టుల్లో కేసులు వేయించి, సరైన వాదనలు వినిపించకుండా బీసీలకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల సుమారు 16,800 మంది బీసీలు చట్టబద్ధంగా దక్కాల్సిన పదవులను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో బీసీ రిజర్వేషన్ల అంశంపై దృష్టి సారించారని, దీని కోసం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. న్యాయస్థానాల పరిమితులకు లోబడి రిజర్వేషన్లు ఖరారు చేసినప్పటికీ, పార్టీల పరంగా బీసీలకు అత్యధిక సంఖ్యలో టికెట్లు కేటాయించడం ద్వారా మొత్తం ప్రాతినిధ్యం 40 శాతానికి పైగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.గత ఐదేళ్ల పాలనలో అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు వంటి బీసీ అగ్రనేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు, తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి వారి హత్యలకు కారణమై బీసీ నాయకత్వాన్ని అణచివేయాలని వైసీపీ ప్రయత్నించిందని మంత్రి ధ్వజమెత్తారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు అంతర్జాతీయ ఖ్యాతి



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు చోటు
ఇది తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమన్న గొట్టిపాటి రవి
భారీ వరదలను తట్టుకున్న నిర్మాణ పటిష్ఠతకు దక్కిన గౌరవమని వ్యాఖ్య

అమరావతి,అక్టోబర్13(సామాన్యుడి అస్త్రం)

శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రతిష్ఠాత్మకమైన ‘వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్’లో స్థానం లభించడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈ అరుదైన గుర్తింపుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. శ్రీశైలం కేవలం విద్యుదుత్పత్తి కేంద్రం మాత్రమే కాదని, లక్షలాది మందికి తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తున్న బహుళార్థసాధక ప్రాజెక్ట్ అని కొనియాడారు.గతంలో భారీ వరదలను తట్టుకుని నిలబడిన శ్రీశైలం డ్యామ్ నిర్మాణ పటిష్ఠతకు ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపు రావడం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు ఇంజనీరింగ్ నైపుణ్యం, విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం, బహుముఖ ప్రయోజనాలకు ఈ పురస్కారం నిదర్శనమని వివరించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టిని మంత్రి ప్రశంసించారు. పట్టిసీమ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావడం వల్లే శ్రీశైలం నీటిని రాయలసీమకు సమర్థంగా వినియోగించుకోగలుగుతున్నామని తెలిపారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటిని సరఫరా చేయడంతో, శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు వాడుకునేందుకు పూర్తి వెసులుబాటు కలిగిందని గొట్టిపాటి గుర్తుచేశారు. శ్రీశైలం జలాశయం ఇప్పటికీ రాయలసీమతో పాటు కృష్ణా డెల్టా రైతుల అవసరాలను తీరుస్తూ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు.

విజయవాడలో తెలుగులో ప్రసంగించిన సీఎం విజయ్..



బెజవాడలో విజయవాడ ఉత్సవ్ 2.0
హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్
తెలుగులో మాట్లాడి అందరినీ అలరించిన విజయ్
తనను ఆహ్వానించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు

అమరావతి,అక్టోబర్13(సామాన్యుడి అస్త్రం)

తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్.. విజయవాడలో తెలుగులో ప్రసంగించి అందరి హృదయాలను గెలుచుకున్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో అట్టహాసంగా జరుగుతున్న ‘విజయవాడ ఉత్సవ్ 2.0’ వేడుకలకు ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్, కాస్త తడబడుతూనే తెలుగులో మాట్లాడటం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.”అందరికీ నమస్కారం. మిమ్మల్ని అందరినీ కలిసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను” అంటూ విజయ్ తన ప్రసంగాన్ని మొదలుపెట్టగానే అక్కడున్న యువత కేరింతలతో హోరెత్తించారు. తన పర్యటన ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, “నదుల అనుసంధానం గురించి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారితో చర్చించేందుకు విజయవాడ వచ్చాను” అని స్పష్టం చేశారు. తన ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, తనను ఆహ్వానించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, విజయవాడ ఉత్సవ్‌తో నగరంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొందని నిర్వాహకులను అభినందించారు. తమిళనాడు సీఎంగా గెలిచిన తర్వాత విజయ్ మొదటిసారి విజయవాడ రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాలు వేరైనా తమ అభిమతం ఒక్కటేనని, దేశం బాగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ వేడుకలకు హాజరైన సీఎం విజయ్‌కు, కళాకారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఓటములకు ఓటర్ల జాబితా కారణమా?:

రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్

సీఈసీ రాజీనామా డిమాండ్‌తో నిరసనలు చేస్తున్న రాహుల్‌పై అమిత్ షా విమర్శలు
గుజరాత్ స్థానిక ఎన్నికల ఓటమికి ఓటర్ల జాబితా సవరణ కారణమా అని ప్రశ్న
గాంధీనగర్‌లో 41 ఏళ్లుగా కాంగ్రెస్ గెలవలేదని గుర్తుచేసిన హోంమంత్రి
ప్రధాని మోదీకి ప్రజామద్దతుకు గుజరాత్ విజయమే నిదర్శనమని వ్యాఖ్య
ప్రతికూల రాజకీయాలు వీడి క్షేత్రస్థాయిలో పనిచేయాలని కాంగ్రెస్‌కు సూచన



న్యూఢిల్లీ,అక్టోబర్13(సామాన్యుడి అస్త్రం)

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్‌లోని గాంధీనగర్ సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కారణమా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ఇటీవల వచ్చిందేనని, కానీ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ వరుస పరాజయాలను చవిచూస్తోందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.మంగళవారం 'ఇండియా' కూటమి నేతలు, విద్యార్థి సంఘాలతో సమావేశమైన అనంతరం రాహుల్ గాంధీ మీడియా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసమే తమ పోరాటమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.రాహుల్ మీడియా సమావేశం ముగిసిన వెంటనే స్పందించిన అమిత్ షా, గుజరాత్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. "గుజరాత్ ప్రజల మనోగతాన్ని ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. యావత్ దేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుక కొండలా నిలబడి ఉందన్న విషయాన్ని ఈ విజయం చాటిచెప్పింది. గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 44 స్థానాలకు గాను బీజేపీ 38 చోట్ల ఘన విజయం సాధించింది. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు బ్యాంకు 10 శాతం పెరిగింది. రాహుల్ గాంధీకి నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. గాంధీనగర్‌లో గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేదు" అని ఆయన గుర్తుచేశారు."రాహుల్ జీ, ఈ ఫలితాలకు కూడా ఓటర్ల జాబితా సవరణే కారణమని అంటారా? ప్రధాని మోదీకి, బీజేపీకి ఉన్న ప్రజాదరణను మీరు తోసిపుచ్చుతారా? మీరు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకప్పుడు అధికారంలో ఉన్న కీలక ప్రాంతంలో 41 ఏళ్లుగా గెలవలేకపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇటీవల పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది" అని అమిత్ షా ఎత్తి చూపారు.ఢిల్లీలో వివిధ పార్టీల కార్యకర్తలను, జనాలను పోగేసినంత మాత్రాన దేశ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోలేరని ఆయన హితవు పలికారు. "దేశ ప్రజల వాస్తవ గొంతుక పొలాల్లో, గ్రామాల్లో, మారుమూల కొండలు, అడవులు, నదీ తీరాల్లో ఉంది. మీకు అక్కడి ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి అనేక రాష్ట్రాల్లో ప్రజలు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను తిరస్కరిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రతికూల రాజకీయాలు మానుకుని ప్రజలతో మమేకం కావాలి" అని ఆయన సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాహుల్ గాంధీ, ఆయన మిత్రపక్షాలకు బీజేపీ-ఎన్డీయే కూటమి మరో భారీ ఓటమిని రుచి చూపిస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

స్టార్‌లింక్‌కు అనుమతులు ఆపండి



స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు అనుమతులు నిలిపివేయాలని కేంద్రానికి విజ్ఞప్తి
ఎలాన్ మస్క్ వ్యాఖ్యలు బాధ్యతారహితమన్న స్వదేశీ జాగరణ్ మంచ్
జాతీయ భద్రత దృష్ట్యా స్టార్‌లింక్‌ను నిరోధించే హక్కు భారత్‌కు ఉందని స్పష్టీకరణ

విదేశీ కంపెనీకి బదులు దేశీయ సేవలను ప్రోత్సహించాలని సూచన

న్యూఢిల్లీ,అక్టోబర్13,(సామాన్యుడి అస్త్రం)

ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్టార్‌లింక్' శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు భారత్‌లో అనుమతులు మంజూరు చేయవద్దని, ఇందుకు సంబంధించిన ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అనుమతుల జాప్యంపై ఎలాన్ మస్క్ భారత ప్రభుత్వం, వ్యాపార వర్గాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎస్‌జేఎం, ఇవి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలని ఆరోపించింది.ఈ అంశంపై స్వదేశీ జాగరణ్ మంచ్ జాతీయ కో-కన్వీనర్ అశ్వినీ మహాజన్ మాట్లాడుతూ, "భారత్‌లో అనుమతుల జాప్యంపై ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారహితమైనవి. వాణిజ్య కార్యకలాపాల కోసం అనుమతులు కోరిన సంస్థ, ఆ ప్రక్రియ కొనసాగుతుండగానే ప్రభుత్వంపై, దేశీయ వ్యాపార వర్గాలపై విమర్శలు చేయడం సమంజసం కాదు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో ఒత్తిడి పెంచే ప్రయత్నంగా ఇది కనిపిస్తోంది" అని విమర్శించారు."జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఏమాత్రం రాజీ పడకూడదు. ఉక్రెయిన్, ఇరాన్, రష్యా, చైనా, తైవాన్ వంటి పలు దేశాల్లో స్టార్‌లింక్ సేవలు ఇప్పటికే వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో, జాతీయ భద్రత దృష్ట్యా స్టార్‌లింక్‌ను నిరోధించే పూర్తి హక్కు భారత్‌కు ఉంది. మన నిర్ణయం అమెరికా వంటి వాణిజ్య భాగస్వాములకు సైతం ఒక స్పష్టమైన సందేశాన్ని పంపుతుంది" అని మహాజన్ పేర్కొన్నారు.ఒకవేళ జాతీయ భద్రత కారణాలతో స్టార్‌లింక్‌కు అనుమతులు నిరాకరిస్తే, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రోత్సహించేందుకు గొప్ప అవకాశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం మన సొంత సాంకేతికతతో ఇంటర్నెట్ సేవలను అందించవచ్చని సూచించారు. ప్రస్తుతం స్టార్‌లింక్ దరఖాస్తు ప్రభుత్వ పరిశీలనలో ఉన్న తరుణంలో, ఎస్‌జేఎం చేసిన ఈ విజ్ఞప్తి ప్రాధాన్యత సంతరించుకుంది.

లడఖ్ పేర్లపై చైనా అక్కసు.. గట్టిగా బుద్ధి చెప్పిన భారత్

లడఖ్‌లోని 28 ప్రాంతాలకు పేర్లు ఖరారు చేసిన కేంద్రం
భారత్ చర్యపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన చైనా
లడఖ్ భారత్‌లో అంతర్భాగమని స్పష్టం చేసిన విదేశాంగ శాఖ
చైనా వాదనలతో వాస్తవాలు మారవని భారత్ ఘాటు జవాబు

న్యూఢిల్లీ,అక్టోబర్13(సామాన్యుడి అస్త్రం)

లడఖ్‌లోని 28 వ్యూహాత్మక ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా పేర్లు ఖరారు చేయడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్య చట్టవిరుద్ధమని చైనా ఆరోపించగా, భారత్ అత్యంత ఘాటుగా స్పందించింది. లడఖ్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగమని, చైనా ఆరోపణలు ఈ వాస్తవాన్ని మార్చలేవని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, లడఖ్ యంత్రాంగంతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. శిఖరాలు, కనుమలు, జలవనరులతో సహా మొత్తం 28 ప్రదేశాలకు ప్రామాణిక పేర్లను నిర్ణయించి, వాటిని సర్వే ఆఫ్ ఇండియా అధికారిక మ్యాప్‌లో చేర్చనున్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాలకు సంబంధించి స్పష్టమైన గుర్తింపు, అవగాహన పెరుగుతుందని విదేశాంగ శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.తన భౌగోళిక రికార్డులను పటిష్టం చేసుకునేందుకే భారత్ ఈ చర్యలు చేపట్టింది.



దీనిపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందిస్తూ, భారత్ ఏకపక్షంగా ఏర్పాటు చేసిన 'కేంద్రపాలిత ప్రాంతం లడఖ్'ను తాము ఎన్నడూ గుర్తించలేదని వ్యాఖ్యానించారు. "భారత్ ప్రకటించిన ప్రామాణిక పేర్లను మేము వ్యతిరేకిస్తున్నాం. ఈ చర్య చట్టవిరుద్ధం, చెల్లదు. చైనా-భారత్ సరిహద్దులోని పశ్చిమ సెక్టార్‌లోని ఆ ప్రాంతాలు ఎల్లప్పుడూ చైనా భూభాగాలే" అని ఆమె వాదించారు.చైనా వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది.

ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ.. కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు!



ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణపై సుప్రీంకోర్టు నోటీసులు
కేంద్రం, ఎన్నికల సంఘం సమాధానాలు ఇవ్వాలని ఆదేశం
తదుపరి విచారణ నవంబర్ 2న జరిగే అవకాశం
2023 చట్టంలోని సెక్షన్ 16ను సవాల్ చేసిన ఏడీఆర్
రక్షణ వల్ల జవాబుదారీతనం తగ్గుతుందని ఏడీఆర్ వాదన

న్యూఢిల్లీ,అక్టోబర్13,(సామాన్యుడి అస్త్రం)

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు చట్టం ద్వారా కల్పించిన విస్తృత న్యాయపరమైన రక్షణను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈ రక్షణ రాజ్యాంగంలోని సమానత్వ హక్కు, భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధమని 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్' (ఏడీఆర్) తన పిటిషన్‌లో పేర్కొంది.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై స్పందించింది. కేంద్రం, ఎన్నికల సంఘం తమ సమాధానాలను సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 2న చేపట్టే అవకాశం ఉంది.

అసలు వివాదం ఏంటి?

2023లో తీసుకొచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలోని సెక్షన్ 16 ఈ వివాదానికి కేంద్రంగా ఉంది. ఈ నిబంధన ప్రకారం.. ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా లేదా ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన వ్యక్తి, తన అధికారిక విధుల నిర్వహణలో లేదా విధులు నిర్వహిస్తున్నట్లు భావించి చేసిన చర్యలు, మాట్లాడిన మాటలకు సంబంధించి ఆయనపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న అలాంటి కేసులను కూడా కొనసాగించకూడదని ఈ సెక్షన్ పేర్కొంటోంది. ఈ రక్షణ విధుల్లో ఉన్నవారికే కాకుండా, గతంలో ఆ పదవుల్లో పనిచేసినవారికీ వర్తిస్తుంది. అయితే, ఈ నిబంధన రాజ్యాంగబద్ధతనే ఏడీఆర్ సవాలు చేసింది.

ఏడీఆర్ అభ్యంతరాలేంటి?

సెక్షన్ 16 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కు, ఆర్టికల్ 19లోని స్వేచ్ఛకు సంబంధించిన హక్కులను ఉల్లంఘిస్తోందని ఏడీఆర్ వాదిస్తోంది. ఎన్నికల కమిషనర్లకు ఇంత విస్తృత రక్షణ కల్పించడం వల్ల వారి చర్యలపై జవాబుదారీతనం తగ్గుతుందని పిటిషన్‌లో పేర్కొంది. అధికార దుర్వినియోగం లేదా అవినీతికి సంబంధించిన ఆరోపణలపై న్యాయపరమైన పరిశీలనకు అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేసింది.


ఎన్నికల సంఘం అధికారాలపైనా మరో పిటిషన్

ఎన్నికల సంఘం పనితీరు, దాని అధికారాల వినియోగంపై కూడా సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు విచారణకు వస్తున్నాయి. ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘానికి చెందిన అధికారాలను వ్యక్తిగతంగా వినియోగించగలరా లేదా ఆ సంస్థ తరపున ఏకపక్షంగా వ్యవహరించగలరా అనే అంశంపై దాఖలైన మరో పిటిషన్‌పై కూడా అక్టోబర్ 5న ధర్మాసనం కేంద్రానికి, ఎన్నికల సంఘానికి, ముగ్గురు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ, ఆదేశాలు, నియంత్రణాధికారాలు ఎన్నికల సంఘం అనే సంస్థకు ఉంటాయని పిటిషనర్ వాదించారు. ఈ అధికారాలను సీఈసీ ఒక్కరే వినియోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపైనా సుప్రీంకోర్టు స్పందన కోరింది.

సీఈసీ నియామక చట్టంపైనా భేదాభిప్రాయం

2023 చట్టంలో సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపైనా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.సెప్టెంబర్ 23న ఈ అంశంపై విచారణ జరిపిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి పంపాల్సిన అవసరం లేదని అభిప్రాయపడగా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఇందులో రాజ్యాంగపరమైన కీలక ప్రశ్నలు ఉన్నాయని పేర్కొని విస్తృత ధర్మాసనానికి పంపాలని సూచించారుదీంతో ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలా వద్దా అనే విషయాన్ని పరిశీలించేందుకు కేసు పత్రాలను సీజేఐ సూర్యకాంత్ ముందుంచాలని ఇద్దరు న్యాయమూర్తులు ఆదేశించారుప్రస్తుతం అమల్లో ఉన్న 2023 చట్టం ప్రకారం, నియామక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రివర్గ సభ్యుడు ఉంటారు. అంతకుముందు, 2023 మార్చిలో అనూప్ బరణ్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఏర్పాటులో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలని పేర్కొంది.ఎన్నికల కమిషనర్లకు కల్పించిన న్యాయపరమైన రక్షణ, వారి అధికారాల వినియోగం, నియామక విధానం వంటి అంశాలు ఇప్పుడు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నాయి.

వర్కవుట్ తర్వాత ఏం తినాలి?



వ్యాయామం తర్వాత కండరాల మరమ్మతుకు, శక్తి పునరుద్ధరణకు పోషకాహారం కీలకం

ఖరీదైన ప్రొటీన్ షేక్‌లకు బదులు సాధారణ ఆహారమే మేలని నిపుణుల సూచన

ఆహారంలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు సమపాళ్లలో ఉండేలా చూసుకోవాలంటున్న నిపుణులు

గుడ్లు, పనీర్, పప్పు, అన్నం, చికెన్ వంటివి తీసుకోవడం ఉత్తమం

శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి తగినన్ని నీళ్లు తాగడం ముఖ్యం

జిమ్‌లో గంటల తరబడి చెమటోడ్చిన తర్వాత ఏం తినాలనే సందేహం చాలామందిలో ఉంటుంది. కండరాల రికవరీకి, శక్తిని తిరిగి పొందడానికి ఖరీదైన ప్రొటీన్ షేక్‌లు, సప్లిమెంట్లు తప్పనిసరి అని చాలామంది భావిస్తుంటారు. అయితే, వాటి అవసరం ఏమాత్రం లేదని, ఇంట్లో లభించే సాధారణ, సమతుల్య ఆహారంతోనే చక్కటి ఫలితాలు సాధించవచ్చని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వ్యాయామం చేయడం వల్ల శరీరంపై ఒత్తిడి పడుతుంది. ఈ సమయంలో కండరాల్లోని ప్రొటీన్లు దెబ్బతింటాయి, శరీరంలోని శక్తి నిల్వలు (గ్లైకోజెన్) ఖర్చవుతాయి. వీటిని తిరిగి భర్తీ చేయడానికి సరైన పోషకాహారం చాలా ముఖ్యం. కండరాల మరమ్మతు, పెరుగుదలకు ప్రొటీన్ అత్యంత కీలకం. ఇందుకోసం గుడ్లు, పనీర్, పెరుగు, చికెన్, చేపలు, టోఫు, పప్పుధాన్యాలు వంటివి ఆహారంలో చేర్చుకోవాలి. అలాగే, కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి కార్బోహైడ్రేట్లు అవసరం. అన్నం, రొట్టె, ఓట్స్, బంగాళాదుంపలు, అరటిపండ్లు వంటివి తీసుకోవడం ద్వారా గ్లైకోజెన్ నిల్వలను నింపుకోవచ్చు.

20-20-20 రూల్ అంటే ఏమిటి?



ల్యాప్‌టాప్‌ను పూర్తి బ్రైట్‌నెస్‌లో ఎక్కువసేపు వాడటం కళ్ల ఆరోగ్యానికి హానికరం

గదిలోని వెలుతురుకు తగినట్లుగా స్క్రీన్ బ్రైట్‌నెస్‌ను సర్దుబాటు చేసుకోవాలంటున్న నిపుణులు

కంటికి, స్క్రీన్‌కు మధ్య కనీసం 25 అంగుళాల దూరం పాటించడం ముఖ్యం

ప్రతి 20 నిమిషాలకు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు చూడాలి

కళ్ల సమస్యలు తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం

ప్రస్తుత డిజిటల్ యుగంలో ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు మన జీవితంలో భాగమైపోయాయి. ఆఫీస్ పనుల నుంచి వినోదం వరకు అన్నింటికీ స్క్రీన్‌ల మీదే ఆధారపడటం సర్వసాధారణమైంది. అయితే, గంటల తరబడి ల్యాప్‌టాప్ వాడేటప్పుడు చాలామంది చేసే ఒక సాధారణ పొరపాటు వారి కళ్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ల్యాప్‌టాప్ స్క్రీన్ బ్రైట్‌నెస్‌ను ఎల్లప్పుడూ 100 శాతంలో ఉంచి వాడటం వల్ల కళ్లు తీవ్రమైన ఒత్తిడికి గురవుతాయని వారు స్పష్టం చేస్తున్నారు.ఈ అంశంపై నిపుణులు కీలక విషయాలు వెల్లడించారు. మనం కూర్చున్న గదిలోని వెలుతురు కంటే ల్యాప్‌టాప్ స్క్రీన్ ప్రకాశం చాలా ఎక్కువగా ఉన్నప్పుడు, కళ్లు ఆ తేడాకు సర్దుబాటు కావడానికి నిరంతరం శ్రమించాల్సి వస్తుందని వివరించారు. ఈ ప్రక్రియలో కంటి కండరాలు అలసిపోయి, సాయంత్రానికి కళ్లలో మంట, కళ్లు బరువెక్కడం, నీరు కారడం, చూపు మసకబారడం, తల దిమ్ముగా ఉండి తేలికపాటి తలనొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. దీన్నే 'డిజిటల్ ఐ స్ట్రెయిన్' లేదా 'కంప్యూటర్ విజన్ సిండ్రోమ్' అని పిలుస్తారు.

తగిన బ్రైట్‌నెస్ ఎంత ఉండాలి?

అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆప్తాల్మాలజీ ప్రకారం.. స్క్రీన్ బ్రైట్‌నెస్‌కు నిర్దిష్టమైన కొలమానం అంటూ ఏదీ లేదు. గదిలో ఉన్న వెలుతురు (యాంబియంట్ లైటింగ్)కు సరిపోయేలా స్క్రీన్ ప్రకాశాన్ని సర్దుబాటు చేసుకోవడం ఉత్తమమైన పద్ధతి. ఉదాహరణకు, తక్కువ వెలుతురు ఉన్న గదిలో మీ ల్యాప్‌టాప్ స్క్రీన్ ఒక దీపంలా వెలిగిపోతుంటే, దాని బ్రైట్‌నెస్‌ను తగ్గించాల్సిన అవసరం ఉందని అర్థం. దీనివల్ల కళ్లపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది.

కరోనరీ ఆర్టరీలో బ్లాకేజ్ ఎంత ప్రమాదం?

గుండె కండరాలకు ఆక్సిజన్, పోషకాలను అందించే రక్తనాళాలే కరోనరీ ఆర్టరీలు

ధమనుల గోడల్లో కొవ్వు, కొలెస్ట్రాల్ తదితర పదార్థాలు పేరుకుపోయి ప్లాక్

ప్లాక్ పగిలినా, దాని ఉపరితలం దెబ్బతిన్నా అక్కడ రక్తం గడ్డకట్టే ప్రక్రియ ప్రారంభం

గడ్డ పెరిగి రక్తప్రవాహాన్ని అడ్డుకుంటే గుండె కండరాలకు ఆక్సిజన్ బంద్

ఫలితంగా గుండెపోటు సంభవించే ప్రమాదం



గుండెపోటు అంటే ఛాతీలో నొప్పి రావడమే కాదు.. కొన్నిసార్లు స్పష్టమైన ముందస్తు సంకేతాలు లేకుండానే ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చు. గుండెకు ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని సరఫరా చేసే ధమనిలో రక్తం గడ్డకట్టి ప్రవాహాన్ని అడ్డుకుంటే పరిస్థితి క్షణాల్లో విషమించవచ్చు. ప్రముఖ నటుడు నానా పటేకర్ మరణానికి కారణంగా ఇలాంటి సమస్యను పేర్కొన్న నేపథ్యంలో కరోనరీ ఆర్టరీ అంటే ఏమిటి? అందులో బ్లాకేజ్ ఎందుకు ఏర్పడుతుంది? దాన్ని ముందుగా గుర్తించడం ఎలా? గుండెపోటు ముప్పును తగ్గించుకోవడం ఎలా? తెలుసుకుందాం..

కరోనరీ ఆర్టరీ అంటే ఏంటి?

గుండె నిరంతరం పనిచేయడానికి ఆక్సిజన్, పోషకాలు అవసరం. వీటిని గుండె కండరాలకు అందించే రక్తనాళాలను కరోనరీ ఆర్టరీలు అంటారు. వీటిలో ఎడమ ప్రధాన కరోనరీ ధమని కీలకమైనది. ఇది రెండు పెద్ద శాఖలుగా విడిపోయి గుండెలోని విస్తృత ప్రాంతాలకు రక్తాన్ని సరఫరా చేస్తుంది. అందుకే ఈ ధమనిలో రక్తప్రవాహం ఒక్కసారిగా ఆగిపోతే గుండె కండరాల్లో పెద్ద భాగం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. గుండె రక్తాన్ని పంపించే సామర్థ్యం తగ్గి, తీవ్రమైన గుండె లయ సమస్యలు లేదా కార్డియాక్ అరెస్ట్ కూడా సంభవించవచ్చు.

బ్లాకేజ్ ఎందుకు ఏర్పడుతుంది?

కరోనరీ ఆర్టరీల్లో బ్లాకేజ్‌కు ప్రధాన కారణాల్లో ఒకటి అథెరోస్క్లెరోసిస్. అంటే ధమనుల గోడల్లో కొవ్వు, కొలెస్ట్రాల్ తదితర పదార్థాలు పేరుకుపోయి ప్లాక్ అనే పొరలు ఏర్పడటం. ఇవి ధమనులను ఇరుకుగా మార్చి రక్తప్రసరణకు అడ్డంకిగా మారతాయి.

అయితే గుండెపోటు రావడానికి ధమని పూర్తిగా మూసుకుపోవాల్సిన అవసరం లేదు. అప్పటికే ఉన్న ప్లాక్ పగిలినా, దాని ఉపరితలం దెబ్బతిన్నా అక్కడ రక్తం గడ్డకట్టే ప్రక్రియ మొదలవుతుంది. గడ్డ పెరిగి రక్తప్రవాహాన్ని అడ్డుకుంటే గుండె కండరాలకు ఆక్సిజన్ అందదు. ఫలితంగా గుండెపోటు సంభవించవచ్చు. గతంలో గుండె సమస్య ఉన్నట్లు నిర్ధారణ కాకపోయినా ఈ ప్రమాదం ఎదురయ్యే అవకాశం ఉంది.

బ్లాకేజ్‌ను గుర్తించడం ఎలా?

గుండె ధమనుల్లో సమస్య ఉందో లేదో తెలుసుకోవడానికి వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యులు పరీక్షలు సూచిస్తారు.లిపిడ్ ప్రొఫైల్: కొలెస్ట్రాల్, ఇతర కొవ్వు పదార్థాల స్థాయిలను తెలుసుకోవచ్చు.

రక్తపోటు, మధుమేహ పరీక్షలు: గుండెజబ్బుల ముప్పును అంచనా వేయడానికి ఉపయోగపడతాయి.

ఈసీజీ, ట్రోపోనిన్ పరీక్ష: గుండెపోటు అనుమానం ఉన్నప్పుడు గుండె విద్యుత్ సంకేతాలు, కండరాలకు జరిగిన నష్టాన్ని గుర్తించడంలో సహాయపడతాయి.

సీటీ కరోనరీ యాంజియోగ్రఫీ, కరోనరీ యాంజియోగ్రఫీ: అవసరాన్ని బట్టి ధమనుల్లో అడ్డంకులను గుర్తించడానికి ఉపయోగిస్తారు.

అందరికీ ఈ పరీక్షలన్నీ అవసరం లేదు. వయసు, లక్షణాలు, కుటుంబ చరిత్ర, ఇతర ఆరోగ్య సమస్యలను బట్టి వైద్యులు తగిన పరీక్షలను సూచిస్తారు.

గుండెపోటు ముందస్తు సంకేతాలేంటి?

ఛాతీ మధ్యలో బిగుతు, ఒత్తిడి లేదా నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చల్లని చెమటలు, వికారం, తలతిరగడం, అసాధారణ అలసట గుండెపోటు లక్షణాలు కావచ్చు. నొప్పి చేతులు, వీపు, మెడ లేదా దవడకు వ్యాపించవచ్చు. కొందరిలో ఛాతీ నొప్పి లేకుండానే ఇతర లక్షణాలు కనిపించవచ్చు.ఈ లక్షణాలను ఎసిడిటీ లేదా అజీర్ణంగా భావించి నిర్లక్ష్యం చేయకూడదు. గుండెపోటు అనుమానం వచ్చిన వెంటనే అత్యవసర వైద్యసాయం పొందాలి. భారతదేశంలో 112కు ఫోన్ చేయవచ్చు. బాధితుడు స్పృహ కోల్పోయి, సాధారణంగా శ్వాస తీసుకోకపోతే అత్యవసర సిబ్బంది సూచనల మేరకు సీపీఆర్ ప్రారంభించాలి.

ముప్పును తగ్గించుకోవడం ఎలా?

అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, పొగతాగడం, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం గుండెజబ్బుల ముప్పును పెంచుతాయి. కుటుంబంలో చిన్న వయసులోనే గుండెజబ్బులు వచ్చిన చరిత్ర ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి.రక్తపోటు, కొలెస్ట్రాల్, చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవడం, పొగాకుకు దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం ద్వారా ముప్పును తగ్గించుకోవచ్చు. అవసరమైన ఆరోగ్య పరీక్షలను వైద్యుల సూచన మేరకు చేయించుకోవాలి.

ఒంటి కాలిపై 10 సెకన్లు నిలబడగలరా?
మీ ఆరోగ్యం గురించి ఈ పరీక్ష ఏం చెబుతుందంటే..!



ఒంటి కాలిపై నిలబడగలగడం శరీర సమతుల్యతకు సూచన

వయసుతో కండరాల బలం తగ్గితే పడిపోయే ప్రమాదం

2022 అధ్యయనంలో సమతుల్యతకు, ఆరోగ్యానికి సంబంధం ఉందని వెల్లడి

ఈ పరీక్షతో అనారోగ్యాన్ని నిర్ధారించలేమంటున్న నిపుణులు

నడక, వ్యాయామాలతో బ్యాలెన్స్‌ను సాధించే అవకాశం

ఒంటి కాలిపై 10 సెకన్ల పాటు నిలబడటం చాలా చిన్న విషయంలా అనిపించవచ్చు. కానీ మన శరీర సమతుల్యత, కండరాల బలం, నాడీ వ్యవస్థ పనితీరు గురించి ఇది కొన్ని కీలక విషయాలను తెలియజేస్తుంది. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ శరీరంలో వచ్చే మార్పులు మన బ్యాలెన్స్‌పై ప్రభావం చూపుతాయి. కొందరు సులభంగా ఒక్క కాలిపై నిలబడగలిగితే.. మరికొందరు తడబడుతుంటారు. ఇలాంటి సమస్యలు వృద్ధాప్యంలో పడిపోయి గాయాలపాలయ్యే ప్రమాదాన్ని పెంచవచ్చు.అయితే, ఒక్క కాలిపై 10 సెకన్లు నిలబడలేకపోయినంత మాత్రాన ఏదో తీవ్రమైన అనారోగ్యం ఉన్నట్లు భావించకూడదు. వయసు, కండరాల బలం, కీళ్ల పనితీరు, చూపు, నాడీ వ్యవస్థతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దీనిపై ప్రభావం చూపుతాయి.ఒంటి కాలిపై నిలబడాలంటే శరీరంలోని పలు వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి. కండరాలు శరీర బరువును మోయాలి. కీళ్లు స్థిరంగా ఉండాలి. కళ్లు, లోపలి చెవి నుంచి అందే సమాచారాన్ని మెదడు విశ్లేషించి శరీరం పడిపోకుండా నియంత్రించాలి. వీటిలో ఏ వ్యవస్థ పనితీరు దెబ్బతిన్నా సమతుల్యతను కాపాడుకోవడం కష్టమవుతుంది. 2022లో 'బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్'లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం.. ఒక్క కాలిపై 10 సెకన్లు నిలబడలేని మధ్య వయస్కులు, వృద్ధుల్లో తర్వాతి సంవత్సరాల్లో ఏ కారణంతోనైనా మరణించే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే, ఈ అధ్యయనం ఆధారంగా ఒక్క కాలిపై నిలబడలేని ప్రతి ఒక్కరికీ ప్రాణాపాయం ఉందని చెప్పలేం. ఇది ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడానికి ఉపయోగపడే ఒక సూచన మాత్రమే.

ఈ పరీక్ష ఎందుకు ముఖ్యం?

ముఖ్యంగా వృద్ధుల్లో శారీరక సామర్థ్యం తగ్గుతోందా? పడిపోయే ప్రమాదం ఉందా? అన్నది అంచనా వేయడానికి ఇది ఒక సూచనగా ఉపయోగపడుతుంది. అయితే, ఈ పరీక్ష ఒక్కటే ఆరోగ్య సమస్యలను నిర్ధారించలేదు.వడిపోయే ప్రమాదంపై అంచనా: సమతుల్యతలో ఇబ్బందులు ఉంటే మరింత పరిశీలన అవసరం కావచ్చు.శారీరక సామర్థ్యంపై అవగాహన: కండరాల బలం, శరీర నియంత్రణ గురించి ప్రాథమిక సమాచారం లభిస్తుంది.ఆరోగ్య సమస్యల గుర్తింపు: తరచూ తడబడటం వంటి లక్షణాలుంటే వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి రావచ్చు.

వృద్ధుల సంరక్షణలో ఉపయోగం: వయసుతో శారీరక సామర్థ్యంలో వస్తున్న మార్పులను గమనించేందుకు ఇది తోడ్పడుతుంది.

ఇంట్లోనే పరీక్షించుకోవచ్చా?

కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఇంట్లోనే ఈ పరీక్ష చేసుకోవచ్చు.

జారిపోని నేలపై నిలబడాలి.

పక్కనే గోడ లేదా గట్టి కుర్చీ ఉండేలా చూసుకోవాలి.

రెండు పాదాలను దగ్గరగా ఉంచి నిటారుగా నిలబడాలి.

ఒక పాదాన్ని నేల నుంచి కొద్దిగా పైకి ఎత్తాలి.

పడిపోకుండా 10 సెకన్లు నిలబడేందుకు ప్రయత్నించాలి.

ఆ తర్వాత మరో కాలితోనూ పరీక్షించాలి. తడబడుతున్నా, పడిపోతాననే భయం ఉన్నా ఒంటరిగా ఈ పరీక్ష చేయకూడదు.

సమతుల్యతను ఎలా మెరుగుపరుచుకోవాలి?

క్రమం తప్పకుండా నడవడం, కాళ్ల కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయడం, సహాయంతో బ్యాలెన్స్ ప్రాక్టీస్ చేయడం ఉపయోగపడతాయి. తగిన పర్యవేక్షణలో తైచీ వంటి వ్యాయామాలు కూడా వృద్ధులకు మేలు చేయవచ్చు. వయసు, శారీరక సామర్థ్యానికి తగిన వ్యాయామాలనే ఎంచుకోవాలి.ఒంటి కాలిపై 10 సెకన్లు నిలబడటం ఆరోగ్యాన్ని పూర్తిగా అంచనా వేసే పరీక్ష కాదు. అయితే, బాడీ బ్యాలెన్స్ గురించి తెలుసుకోవడానికి ఇది ఓ చిన్న సూచనగా ఉపయోగపడుతుంది. తరచూ తడబడటం, నడవడంలో ఇబ్బంది లేదా అకస్మాత్తుగా బ్యాలెన్స్ కోల్పోవడం కనిపిస్తే వైద్యులను సంప్రదించడం మంచిది.

అప్పటివరకు నేను చాలా అందగత్తెనని అనుకున్నాను..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శర్మ తన కెరీర్ తొలినాళ్లలో ఎదురైన ఒక కఠినమైన అనుభవాన్ని పంచుకున్నారు. తన తొలి చిత్రం 'రబ్ నే బనా ది జోడీ' సమయంలో నిర్మాత, దర్శకుడు ఆదిత్య చోప్రా తనతో అన్న మాటలు తనను ఎంతగా ప్రభావితం చేశాయో 'కాఫీ విత్ కరణ్' షోలో వెల్లడించారు.ఈ సంఘటనను గుర్తుచేసుకుంటూ అనుష్క, "నేను ఆదిత్య చోప్రా ఆఫీసులో నాలుగో అంతస్తులో ఉన్నాను. ఆయన నాతో, 'వినండి, మీ ప్రతిభపై నాకు చాలా నమ్మకం ఉంది. మీరు మంచి నటి. కానీ మీరు చూడటానికి అంత అందంగా ఉండరు. అందుకే మీరు చాలా కష్టపడాలి. 'తానీ' పాత్రకు మిమ్మల్ని తీసుకుంటున్నాం' అని నిక్కచ్చిగా చెప్పారు" అని తెలిపారు.ఆ మాటలు విన్న తర్వాత తన స్పందన గురించి వివరిస్తూ, "ఆఫీసు నుంచి బయటకు వచ్చేటప్పుడు నేను చాలా మామూలుగానే ఉన్నాను. ఆయనకు 'థాంక్యూ' చెప్పి వచ్చేశాను. కానీ కారులో వెళ్తుండగా నాకే తెలియకుండా ఏడుపు వచ్చేసింది. కారు ఆపి మరీ ఏడ్చాను. ఆ సమయంలో మా అమ్మానాన్న ఊళ్లో లేరు. మా అమ్మకు ఫోన్ చేసి, 'ఇలా జరిగిందని నమ్మలేకపోతున్నాను' అని చెప్పాను" అని అనుష్క ఆనాటి బాధను పంచుకున్నారు.



ఏఐ ఫొటోలు చూస్తే 'అది నేనేనా?'



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ దుర్వినియోగంపై, ముఖ్యంగా డీప్‌ఫేక్, మార్ఫింగ్ ఫొటోలపై సీనియర్ నటి శ్రియ శరణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన ఫొటోలను అసభ్యంగా మార్ఫింగ్ చేస్తున్నారని, వాటిని చూసినప్పుడు 'అసలు అక్కడ ఉన్నది నేనేనా?' అనే సందేహం, ఆవేదన కలుగుతాయని ఆమె అన్నారు.కొన్నిసార్లు తన శరీరాకృతిని అసహ్యంగా మార్చేస్తున్నారని, ఒంటిపై ఉన్న దుస్తులను తొలగించి చిత్రీకరిస్తున్నారని శ్రియ వాపోయారు. ఇది కొందరికి నవ్వులాటగా అనిపించవచ్చని, కానీ తనకు మాత్రం ఎంతో బాధ కలిగిస్తుందని చెప్పారు. గతంలో తాను కూడా ఇలాంటి మార్ఫింగ్ ఫొటోల బారిన పడ్డానని గుర్తు చేసుకున్నారు. ఏఐ టెక్నాలజీకి ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, దానిని బాధ్యత లేకుండా వాడితే తీవ్రమైన ప్రమాదాలు తప్పవని, ఇలాంటి సాంకేతిక సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

మళ్లీ అదే ప్రశ్న.. 'ఇంకా వర్జినేనా?'



బాలీవుడ్ ప్రముఖుల వ్యక్తిగత విషయాలను రాబట్టడంలో పేరుగాంచిన చాట్ షో.. 'కాఫీ విత్ కరణ్'. ఎన్నో ఏళ్లుగా విజయవంతంగా సాగుతున్న ఈ షో ఫైనల్ సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ చివరి సీజన్‌లో మొదటి అతిథిగా బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ హాజరయ్యారు. దీనికి సంబంధించిన కొత్త ప్రోమోను నిర్వాహకులు విడుదల చేయగా, అది ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ప్రోమోలో హోస్ట్ కరణ్ జోహార్, సల్మాన్‌ను మరోసారి తన ఫేమస్ ప్రశ్నతో ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు.నీట్-2026 పేపర్ లీక్ వ్యవహారంపై జరిగిన నిరసనల సందర్భంగా సోనమ్ వాంగ్‌చుక్‌కు మద్దతుగా సల్మాన్ ఖాన్ చెప్పిన 'ఇట్స్ డన్ బ్రో' అనే డైలాగ్‌ను ప్రస్తావిస్తూ కరణ్ షోలోకి సల్మాన్‌ను ఆహ్వానించారు.

బాలీవుడ్‌లోకి బేబమ్మ!

'ఉప్పెన'తోచిత్రసీమలో(అడుగుపెట్టి, తొలి సినిమాతోనే బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ద్వారా ఓవర్ నైట్‌లోనే కుర్రకారు గుండెల్లో 'బేబమ్మ'గా తిష్ట వేసిన ముద్దుగుమ్మ కృతి శెట్టిఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకున్నప్పటికీ సరైన హిట్ అందుకోలేకపోయిందీ క్యూట్ బ్యూటీ. ఇక ఇటీవల విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాలో నటించిన ఈ భామ భారీ డిజాస్టర్‌ను చవిచూసింది. ప్రస్తుతం జయం రవి సరసన 'జీనీ' అనే భారీ చిత్రంలో నటిస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, కృతి శెట్టికి సంబంధించిన ఒక వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది.ఈ చిన్నది ఇప్పుడు బాలీవుడ్‌లోకి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోందనేదే ఆ వార్తల సారాంశం. ఒక రొమాంటిక్ లవ్ స్టోరీతో హిందీ ఇండస్ట్రీలో అడుగుపెడుతున్నట్టు టాక్ వినవస్తోంది.



డేటింగ్ వ్యాఖ్యలపై శోభిత ధూళిపాళ్ల వివరణ!

నటుడితో డేటింగ్ చేయనని గతంలో చేసిన వ్యాఖ్యలపై శోభిత ధూళిపాళ్ల స్పందన
అప్పట్లో తన ఆలోచనలు వేరుగా ఉండటంతో అలా చెప్పానని వివరణ
కాలక్రమేణా అభిప్రాయాలు మారడం సహజమని వ్యాఖ్య
ప్రేమంటే కేవలం రొమాన్స్ మాత్రమే కాదని వెల్లడి
వ్యక్తిగత జీవితంపై వచ్చే వార్తలకు అధిక ప్రాధాన్యం ఇవ్వొద్దని సూచన



నటుడితో డేటింగ్ చేయనని గతంలో చేసిన వ్యాఖ్యలపై నటి శోభిత ధూళిపాళ్ల స్పందించింది. అప్పట్లో తన ఆలోచనలు వేరుగా ఉండటంతో అలా చెప్పానని తెలిపింది. వయసు పెరిగే కొద్దీ ఆలోచనలు మారుతుంటాయని చెప్పింది. పరిస్థితులకు అనుగుణంగా అభిప్రాయాలు మార్చుకోవడంలో తప్పులేదని అభిప్రాయపడింది.ప్రేమంటే కేవలం రొమాన్స్ మాత్రమే కాదని శోభిత పేర్కొంది. అది ఇద్దరి మనసుల కలయిక అని వివరించింది. ఎప్పుడూ ఒకేలా ఆలోచించడం కంటే మార్పును స్వీకరించడం ముఖ్యమని అభిప్రాయపడింది.వ్యక్తిగత జీవితంపై వచ్చే వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకూడదని శోభిత సూచించింది. సమాజంలో అభిప్రాయాలు మారుతుంటాయని, వాటిని పట్టించుకుంటూ పోతే మనల్ని మనం కోల్పోయే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. మన వ్యక్తిత్వంపై స్పష్టతతో ఉండాలని చెప్పింది. శోభిత, నాగచైతన్య 2024లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.

నయనతార పొలిటికల్ ఎంట్రీపై ఆమె భర్త విఘ్నేశ్ శివన్ క్లారిటీ



తమిళనాడులో నటి నయనతార రాజకీయ ప్రవేశంపై జోరుగా సాగుతున్న ఊహాగానాలకు ఆమె భర్త, దర్శకుడు విఘ్నేశ్ శివన్ స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం తమ దృష్టి అంతా కుటుంబం, పిల్లల పెంపకం, వృత్తిపరమైన పనులపైనే ఉందని ఆయన తెలిపారు. ఈ విషయంలోనే తాము సంతృప్తిగా ఉన్నామని పేర్కొంటూ, పరోక్షంగా రాజకీయ ప్రవేశ వార్తలను ఖండించారు.తమిళనాడు ముఖ్యమంత్రిగా నటుడు విజయ్ బాధ్యతలు స్వీకరించి, పాలన సాగిస్తున్న నేపథ్యంలో.. నయనతార, త్రిష వంటి ప్రముఖ నటీమణులు కూడా రాజకీయాల్లోకి వస్తారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా 2031 అసెంబ్లీ ఎన్నికల నాటికి నయనతార రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని కొందరు అంచనా వేస్తున్నారు.ఈ ఊహాగానాలపై విఘ్నేశ్ శివన్ స్పందిస్తూ... ప్రస్తుతం తమకు కుటుంబ బాధ్యతలు, పిల్లల ఆలనాపాలన, వృత్తి జీవితమే ముఖ్యమని స్పష్టం చేశారు. మరోవైపు, నయనతార ప్రస్తుతం 'మూక్కుత్తి అమ్మన్ 2', 'డియర్ స్టూడెంట్స్', 'రక్కాయి' వంటి పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు.గతంలో ఎంజీఆర్, జయలలిత వంటి సినీ ప్రముఖులు రాజకీయాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన చరిత్ర తమిళనాడుకు ఉంది. అయితే, నయనతార రాజకీయ ప్రవేశంపై ఆమె నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ ఊహాగానాలు కొనసాగే అవకాశం ఉంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.